సుజాతకి మనసు మనసులో లేదు! కాలు కాలిన పిల్లిలా వంట ఇంట్లోంచి పడక గదిలోకి పదేపదే తిరుగుతోంది.

భర్త రామారావు మగతగా అలా మంచం మీద పడుకుని వున్నాడు. అతనికి మెలకువ వచ్చినప్పుడల్లా విపరీతంగా మూలుగుతూ బాధ పడుతున్నాడు. భర్త అనారోగ్యంతో అట్లా బాధ పడుతుంటే సుజాతకి గుండె జారిపోతోంది. ఆ మూల్గులకి తన శరీరంలోని నరాలే మెలి తిరిగి పోతున్నట్లు నీరు కారిపోతున్నది. అయినా ఏం చెయ్యగలదు? తనకి చాతనయిన శుశ్రూష చేస్తూనే వుంది.

ఉదయం ఎప్పుడో కప్పు కాఫీ తప్పించి రామారావు ఇంకేం తీసుకోలేదు. సుజాతకి ప్రాణం కొట్టుకుపోతోంది! ఏ రోగం రొష్టూ లేకపోయినా ఒక్క ముద్ద కూడా తినలేకపోయింది! అసలు ఆ కాస్త అన్నం అయినా 'బాబి'గాడి కోసం వండాల్సి వచ్చింది.

జ్వరంతో మంచం మీద పడివున్న రామారావు ఎంత బాధపడుతున్నాడో...ఆరోగ్యంతో వుండి ఇల్లంతా తిరుగుతున్న సుజాత కూడా అంత బాధపడుతోంది! కాకుంటే అతనిది శారీరక రుగ్మత అయితే ఆమెది మానసిక బాధ! అంతే తేడా.

మెల్లిగా మంచం దగ్గరకు వెళ్ళి నిల్చుని భర్త మొఖంలోకి పరిశీలనగా చూసింది సుజాత.

అంత నిద్రలో సహితం అతను మొఖం చిట్లించుకున్నాడు. బాధని బిగపట్టుకున్నట్లు నుదుట ముడతలు పడ్డాయి. ఆహారం ఏమీ తీసుకోక పోవడంతో మొఖం అంతా పీక్కుపోయింది! గెడ్డం మాసి....జుట్టుకి చమురు లేక విడి వడిన చొక్కా బొత్తాములతో అస్తవ్యస్తంగా ఎట్లా పడితే అట్లా వున్నాడు!....

"వారం రోజుల్లో ఎంత చిక్కిపోయారు?" అనుకుంది బాధగా సుజాత. భర్త జుత్తులోనికి వ్రేళ్ళు జొనిపి ప్రేమగా చంపలు నిమరాలనిపించింది. కాని అతనికి నిద్రాభంగం అవుతుందని చెప్పి ఎంతో ఆవేశంతో వుప్పొంగే ప్రేమని నిగ్రహించుకుని వడివడిగా వంట గదిలోకి వచ్చేసింది.

వంకాయలు తీసి కత్తిపీట ముందు పెట్టుకుంది.

అసలు "కూర" చెయ్యాలంటే విసుగ్గా వుంది! కాని బాబీ ఉదయమే కూర లేదని పేచీ పెట్టాడు.

ఏమిటో....బాబీది మంచి, చెడు తెలియని వయస్సు! భర్తకి వంట్లో బాగుండక పోవటంతో అన్యమనస్కంగా అన్నం ఒక్కటే వండి పడేసింది. కంచంలో అన్నం పెట్టి పచ్చడి వేసేసరికి బాబీ చిరాకు పడిపొయ్యాడు. ఏది ఎలా వున్నా వాడికి కూరా, పెరుగూ వుండాల్సిందే.

"ఈ వెధవ పచ్చడి నాకు వద్దు. కూర ఎందుకు వండలేదు?" అంటూ అన్నం పళ్ళెం తోసేసి పెద్దగా పేచీ మొదలు పెట్టాడు!

"ఏం? ఇప్పుడేం కొంపలు మునిగిపోయాయని? పని వెధవకి కూర లేకుండా అన్నం పెడతావా? నేనింకా చచ్చిపోలేదు. బ్రతికే వున్నాను. వాడికింత కడుపునిండా తిండి పెట్టడానికేం?" అంటూ అంత నీరసంలోనూ గదిలోంచి గద్దించాడు రామారావు.

సుజాతకి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. "తాను ఎవరికోసం ఇంత బాధ పడుతున్నది? ఎవరికోసం ఇంత తాపత్రయ పడుతున్నది? ఆ వ్యక్తే అర్థం చేసుకోవడం లేదు" అనుకుంటే ఎంత నిగ్రహించుకున్నా ఆగకుండా జలజలా చెంపల మీంచి కన్నీళ్ళు జారిపోయాయి.

ఏమనుకున్నాడో ఏమో....తల్లి కన్నీరు చూసి బాబీ బిత్తరపొయ్యాడు; పేచీ కట్టిపెట్టి గబగబా కంచం ముందుకి లాక్కుని ఏగొడవా చెయ్యకుండా అన్నం తినేశాడు. వున్న కాస్త పెరుగూ వాడికే వేసింది. ఏ వేళప్పుడు కావల్సి వస్తాయో అని పాలు మాత్రం అట్టే పెట్టింది.

# విలువలు

కాకాని కమల

ఆ పూట సుజాత భోజనం చెయ్యలేక పోయింది. కాస్త కాఫీ తాగి వూరుకుండిపోయింది.

వులుకూ పలుకూ లేకుండా రామారావు అలాగే మగతగా మంచం మీద పడి వున్నాడు.

మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో గ్లాసునిండా హార్లిక్సు కలిపి భర్త కిచ్చింది.


"వద్దు సుజా! ఏ మాత్రం తాగాలని లేదు. కాస్సేపిక్కడ కూర్చో! లోపలేం చేస్తున్నావ్?" అంటూ దిండు మీంచి తల తీసి ఆమె వళ్ళో పెట్టుకున్నాడు.

"ఇప్పుడేగా లోపలికి వెళత? హితవు లేకుంటే ఎలా? ఈ కాస్త తాగండి. మరీ నీరసం అనిపించదు" అని బలవంతం చేస్తే ఎలాగో లేచి ఆమె సహాయంతో ఆ కాస్త త్రాగాడు. సుజాతకి తనే త్రాగినంత సంతృప్తి అనిపించింది!

*

సాయంత్రం నాలుగు గంటలకి డిస్పెన్సరీకి బయలుదేరింది.

"నేను రాలేను. పైగా అక్కడ వెయిటింగ్. నేనంతసేపు కూర్చోలేను. పరిస్థితి చెప్పి నువ్వే మందు తీసుకురా...." అన్నాడు రామారావు భార్యతో.



అంతకు ముందు రెండురోజులూ డిస్పెన్సరీకి రిక్షాలో వెళ్ళి రిక్షాలో వచ్చాడు. "ఈ పూట కూడా ఆయన వస్తే బాగుణ్ను" అనిపించింది సుజాతకి. కాని భర్తకి చెప్పే ధైర్యం లేక 'అస్పటల్'కి బయలుదేరింది.

బాబీ ఇంకా స్కూలునుంచి రాలేదు. పోనీ వాడ్ని అయినా తండ్రిదగ్గర కూర్చో పెడదా మంటే—అనుకుంది. జ్వరంతో వున్న మనిషిని ఒంటరిగా వదిలి వెళ్ళటానికి సుజాతకి ప్రాణం ఒప్పటం లేదు. అయినా ఏం చేస్తుంది? టెంపరేచర్ నోట్ చేసుకుని బయలుదేరింది.



"క్యూ" ప్రకారం—వెళ్ళిన మువ్వావు గంటకి గాని ఆమెకి డాక్టరుగారి దర్శనం కాలేదు.

"మీరు ఒకసారి వచ్చి చూడండి డాక్టరు గారూ! ఆయన బొత్తిగా లేవలేకుండా వున్నారు" అంది.

"పరవాలేదమ్మా! రేపటికల్లా జ్వరం దిగి పోతుంది. ఈ జ్వరం లక్షణాలే అంత" అంటూ ధైర్యం చెప్పి మందిచ్చారు. రెండు గంటలకి ఒకసారి మందు తప్పకుండా వేసుకోవాలని చెప్పారు.

తెల్లవార్లూ సుజాతకి కంటి మీద కునుకు లేదు.

భర్తచేత శ్రద్ధగా మందు తాగించింది.

"నీవు పడుకో సుజీ! మందు నేను వేసు కుంటాలే" అన్నాడు. అయినా సుజాత తనే స్వయంగా మందు తాగించింది!

అర్ధ రాత్రికి జ్వరం దిగజారింది. రామారావు నుదురంతా చెమటలు పోశాయి. డాక్టరు చెప్పిన ప్రకారం ఆ మర్నాటి కల్లా అతని జ్వరం తగ్గింది.

*

తెల్లారి రామారావు పథ్యం తిన్నాడు!

సుజాతకి చాలా సంతోషంగా వుంది. దాదాపు పదిహేను రోజుల తరువాత భర్త అన్నం తింటున్నాడు.

ఆ రోజు శనివారం కూడా కావటంతో ఉదయమే అభ్యంగస్నానం చేసి వెంకటేశ్వరుడికి దీపారాధన చేసింది సుజాత.

వెల్లుల్లిపాయల కారం పొడి, కరివేపాకు వేసి చారు చేసింది. పాత చింతకాయలో ఇంగువ పోపు వేసి నూరింది. అన్నం దగ్గరుండి తినిపించింది.

వారం రోజుల తరువాత తను కూడా ఆ పథ్యం వంటతోటే కడుపు నిండా తిని లేచింది.

అలసిన సుజాతని నిద్రాదేవి ఆశ్రయించింది. కాని తాను పడుకుంటే భర్త కూడా ఎక్కడ నిద్రపోతారో అని, ఆ కబురు ఈ కబురు చెపుతూ అతని దగ్గరే కూర్చుంది.

స్వస్థత చేకూరిన రామారావు రెండు రోజుల తరువాత ఆఫీసుకి వెళ్ళాడు. బలం కోసం డాక్టర్ వ్రాసిచ్చిన మందులు, టానిక్కులు తెచ్చుకున్నాడు!

*

తెల్లవారు ఝామున పాలవాడు కేక పెడుతుంటే మెలుకువ వచ్చింది సుజాతకి.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది. శరీరమంతా సమ్మెటతో పొడిచినట్లు నొప్పిగా వుంది. తలంతా దిమ్ముగా.....బాగా బలుబు భారంగా కూడా అనిపించింది. దానికి తోడు బయట విపరీతమయిన చలి! సుజాతకి చలి బాగా ఎలర్జీ! రెండవసారి కాన్పులో పిల్ల పుట్టిపోవటంతో ఆమెకి చలి జ్వరం వచ్చింది. అప్పట్నుంచి ఒంటికి చలి అస్సలు గిట్టటం లేదు!

వేడివేడిగా అన్నం తిని వెచ్చగా పడుకో వచ్చని చాలామంది 'చలి'ని ఇష్టపడతారు. కాని సుజాతకి మాత్రం చలికాలం వస్తోందంటే చచ్చేంత భయం! మళ్ళీ పాలవాడు తలుపు కొట్టటంతో కొంగు వంటినిండా కప్పుకుని వెళ్ళి తలుపు తీసి పాలు పోయించుకుంది. మళ్ళీ మేడ మెట్లు ఎక్కలేక కిందే చాప పరుచుకుని పడు కుంది. నరాలన్నీ ఒక్కసారి కలుక్కుమన్నాయి.

నిన్నా మొన్నా నలతగా వున్నా ఎలాగో లేచి తిరగ్గలిగింది. కాని ఈ రోజు శరీరం స్వాధీనంలో లేదు.

"మళ్ళీ అర్ధం పడేటట్టుగా వుంది పరిస్థితి" అనుకుంది బరువుగా.

పని మనిషి కాబోలు తలుపు కొడుతోంది!

తప్పని సరిగా లేచి తలుపు తీసింది. "వీళ్ళొకళ్ళు. ఏ కాలమైనా, చీకట్లు విడకుండా తలుపులు బాదాల్సిందే!" అని విసుక్కుంది.

పనిమనిషికి గిన్నెలు పడేసి తల నొప్పి మందు తలకి రాసుకుని మళ్ళీ పడుకుంది. ఆమెకి తెలియకుండానే నిద్రపట్టేసింది!

లేచేసరికి ఏడు గంటలు అయ్యింది. తొమ్మిది గంటలకల్లా వంట రెడీ చెయ్యాలి. ఎట్లా చెయ్యాలి? ఏం సంగతి!.....అనుకుంటూ మెల్లిగా లేచి మొఖం కడుక్కుని కాఫీ చేసింది.

నిలవటానికి శక్తి లేనట్లు తూలిపోతున్నది. లేచి తిరుగుతుంటే కళ్ళు చీకట్లు క్రమ్ముతున్నాయి. "ఓరి భగవంతుడా!" అనుకుంటూ మళ్ళీ శరీరాన్ని చాప మీదకి చేర్చింది.

అలవాటు ప్రకారం రామారావు బెడ్ కాఫీ కోసం పిలిచాడు.

లేచి కాఫీ కలిపి కొడుకుని పిలిచింది.

"ఎందుకమ్మా!" అంటూ వచ్చారు బాబీ.

"ఈ కాఫీ మీ నాన్నకి ఇచ్చిరారా.... అస్తమానం ఆ మెట్లు ఎక్కలేకుండా వున్నాను" అంది. వీళ్ళు అద్దెకి తీసుకున్న పోర్షన్ సగం కిందా సగం పైనా!

"ఇవాళ ఏమిటో....జ్వరం వచ్చినట్లుగా వుందిరా..." అంది కొడుకుతో.

ఎలాగో ఇంత అన్నం వుడకేసి, పప్పు స్టౌ మీద వదేసి మళ్ళీ వచ్చి పడుకుంది.

"ఎలా వుంది?" అని పరామర్శించి బాత్ రూమ్ వైపు వెళ్ళాడు రామారావు.

భర్తని కాస్త పప్పు సంగతి చూసి, కూరకి పోపుకి వెయ్యమందా మనుకుంది.

కాని రామారావు షేవింగ్ సెట్ ముందు పెట్టుకుని కూర్చున్నాడు. పైగా "నీళ్ళు ఏమన్నా కాగాయా లేదా?" అన్నాడు.

"ఇంత చలిలో ఈ నీళ్ళు కాగకపోతే ఎలా పోసుకుంటారనుకున్నావ్?" అని తిట్టుకున్నాడు.

సగం భోజనంలోనే చెయ్యి కడిగేసుకున్నాడు. నిజమే! పప్పు కాటు వాసన వేస్తోంది. కూర లేదు.

"ఎట్లా తినాలని పెట్టావ్ ఈ భోజనం? ఛీ... ఛీ...కొంపలో సుఖం లేదు" అని విసుక్కున్నాడు. నిజమే. కాని సుజాత పరిస్థితి ఆలోచించలేదు. రోజూ అలాగే వుంటోందా భోజనం? టైముకి అన్నీ చక్కగా చేసి పెడుతుంటే సుష్టుగా తినటం లేదూ? మనిషన్న తరువాత రోగం రొష్టూ లేకుండా యంత్రంలా ఎలా పని చెయ్యగలదు?

"సాయంత్రం టిఫిన్ అయినా వుందా? అదీ లేదా?" అన్నాడు చొక్కాబొత్తాములు పెట్టుకుంటూ రామారావు.

మౌనంగా వుండి పోయింది సుజాత.

"నిన్నే...." రెట్టించాడు.

"ఈ రోజుకి బయట తినండి. నాకు ఒంట్లో బాగుండలేదు" అంది.

"నీకు ఒకనాడు బాగుంది కనుక నా ఒంట్లో...." అని విసురుగా బయటికి వెళ్ళి పొయ్యాడు.

"రోగిష్టి మనిషికి ఇంత చేయూత ఇవ్వటం పోయి ఇంకా ఎదురు-చెయ్యలేదని తిడతారేం?" అనుకుంది బాధగా సుజాత.

*

ఆ రోజు సుజాత అన్నం తినలేదు!

పని పిల్లచేత తల నొప్పి మాత్ర తెప్పించుకుని వేసుకుంది. రాత్రికి కొడుకుని బ్రతిమాలి వాడి సహాయంతో అన్నం, కూరా అమర్చింది.

ఆ తెల్లారి అస్సలే లేవలేకపోయింది సుజాత. మూసిన కన్ను తెరవలేకుండా అయిపోయింది. రాత్రి తెల్లవార్లూ ఆమెకి తెలియకుండానే విపరీతంగా మూల్గుతూ బాధపడింది.

ఏమనుకున్నాడో ఏమో...."ఈ రోజు వంట చెయ్యొద్దులే. కారేజీ తెప్పిద్దాం!" అన్నాడు రామారావు.

పని మనిషిచేత కాఫీ చేయించి సుజాతకి ఓ కప్పు ఇచ్చాడు.

"బాబీ! ఇవ్వాళ స్కూలు మానెయ్యరా! అమ్మకి ఏమన్నా కావల్సి వస్తుందో ఏమో" అన్నాడు.

"ఇవాళ మాకు స్పోర్ట్సు వున్నాయి నాన్నా!" అన్నాడు బాబీ. మానెయ్యటానికి వీలు లేదు అన్న ధోరణిలో.

"వాడు మానెయ్యట మెందుకు. నాకు ఏమీ అవసరం వుండదు" అంది నీరసంగా సుజాత.

రోజూ కంటె అరగంట ముందే ఆఫీసుకి వెళ్ళిపొయ్యాడు రామారావు. ఆ మధ్యాహ్నం టిఫిన్ హోటల్లో తిన్నాడు. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో వచ్చాడు.

"ఇంటికివచ్చినా చేసేది ఏముంది? నీ మానాన నువు పడుకుంటావ్. స్టేడియంలో మాచ్ వుంటే చూడటానికి వెళ్ళాను" అన్నాడు.

మౌనంగా వుండిపోయింది సుజాత.

"బాబీ! భోంచేశావురా?" అంటూ చదువుకుంటున్న కొడుకుని పలకరించాడు. క్యారేజీ విప్పి తన భోజనం కానిచ్చి పడుకున్నాడు.

## జీవితం

ఏవో ఊహలు
అంతులేని ఆశలు
ఎడతెగని బాధలు
జ్ఞప్తిలేని సుఖాలు
మరువలేని దుఃఖాలు
అర్థంలేని భయాలు
గమ్యంలేని దూరాలు
జీవంలేని నవ్వులు
వికలమైన స్నేహాలు
అర్థంలేని ఆచారాలు
న్యాయంలేని ధర్మాలు
శిక్షలులేని నేరాలు
నేరాలులేని శిక్షలు
చూడలేని కఠోరాలు
నమ్మలేని నిజాలు
ఆశలేని జీవాలు
ఇవేనా జీవితాలు?
ఇవేనా అనుభవాలు?

—నిమ్మగడ్డ కామేశ్వరి

"సుజీ! మరి నువ్వేం తీసుకున్నావ్? పని మనిషి చేత బ్రెడ్ అయినా తెప్పించుకోక పొయ్యావా?" అన్నాడు.

"వద్దు. తినాలని లేదు" అంది.

నిజానికి ఆమెకి ఆకలి వేస్తున్నది. తీసుకోవ టానికి ఇంట్లో పళ్ళుగాని పాలుగాని లేవు. సాయంత్రం ఎప్పుడో తాగిన కాఫీ. భర్త తొంద రగా వస్తారేమో పళ్ళూ, బ్రెడ్ తెప్పించుకుందా మనుకుంది.

"జ్వరం బాగా వచ్చినట్టుందే!" అన్నాడు ఒంటి మీద చెయ్యేసి.

బాధగా మూల్గింది.

"రాత్రికి తగ్గకపోతే రేపు మందుతెస్తాలే" అన్నాడు. లైటార్పి వెళ్ళి పడుకున్నాడు.

సుజాతకి ఎందుకో....దుఃఖం పొర్లివచ్చింది. నిశ్శబ్దంగా కన్నీరు విడుస్తూ వుండిపోయింది!

*

అట్లా వచ్చిన జ్వరం 5, 6 రోజులకిగాని తగ్గ లేదు సుజాతకి. రెండు రోజులు మందు తెచ్చాడు రామారావు. యధావిధిగా ఆఫీసు నుంచి రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలోనే వచ్చేవాడు. దయదలచి వంట బాధ మాత్రం సుజాతకి తప్పిం చాడు. ఈ నాలుగు రోజులూ బాబీగాని రామా రావుగాని తమ కార్యక్రమాలు మార్చుకోలేదు.

ఐదారు రోజుల నాటికి జ్వరం దిగజారింది సుజాతకి. నెమ్మదిగా లేచి తిరగ్గలిగింది. ఆ మర్నాడు బాగా స్వస్థత చేకూరింది. కాని విపరీతంగా నీరసం మాత్రం పట్టుకుంది. తెల్లవారి తనే లేచి పాలు పోయించుకుంది. పనిమనిషి సహాయంతో వేడి వేడి నీళ్ళు పోసుకుని బీరకాయ కూర వండి చారు చేసింది.

భర్త ఆఫీసుకి వెళ్ళాక తేలిగ్గా పథ్యం తిని లేచింది. ఎంత ఆపుకున్నా ఆగకుంటే మంచం మీద వాలి ఓ గంట నిద్రపోయింది.

కళ్ళు లోతుకుపోయి నీరసంగా తిరుగుతున్న సుజాతకి పనిలో కొంచెం కూడా సహాయపడ లేదు రామారావు. వుస్సురుస్సురంటూ ఎక్కడ పడితే అక్కడ కూర్చునే భార్యని "ఎలా వుంది? ఎలా వుంది?" అని పరామర్శించాడుగాని, ఆమెకి వుపశమనం ఇచ్చే విధంగా ఒక సానుభూతి వాక్యం కూడా వెలిబుచ్చలేదు. బలానికి ఓ టానిక్కు అయినా తేలేదు, కాగా....

"ఏమిటో! నెలనెలా ఈ డాక్టరు బిల్లులు మాత్రం తప్పటంలేదు. ఏమి రోగాలో ఏమిటో..." అనుకున్నాడు స్వగతం లాగా.

సుజాత నిర్లిప్తంగా వుండిపోయింది. కాని ఆమెకి ఎందుకో....ఈ సంఘటనతో....సంసారం పట్ల మునుపటి ప్రేమ భావం తగ్గి ఒక విధమయిన విరక్తి భావం, నిర్లక్ష్యం ఏర్పడ్డాయి!

తనలోని ఆఖరి రక్తం బొట్టు కరిగిపొయ్యే వరకూ చెయ్యగలిగిన నాడు తనకి ఈ ఇంట ఏ లోటూ లేదు! కాని ఒక్కపూట చెయ్యలేక పడుకుంటే తన నోట్లో ఇన్ని మంచినీళ్ళు పోసే వాళ్ళు కూడా లేరు!

"గానుగెద్దుకి నాకూ తేడా ఏమిటి? ఈ ఇంట్లో నా విలువ ఇంతేనా?" నిరాశగా నిట్టూర్చింది సుజాత.

❋

# మీ పాపాయి పుట్టినరోజుకు
# మంచి బహుమతి

"పిల్లలను ఆరోగ్యవంతంగా పెంచాలి" అన్నారు పెద్దలు. చిన్నతనంలో వారి ఆరోగ్యం బాగుంటే, పెద్దయిన తర్వాత వారికి అది ఎంతయినా సహాయకారిగా వుంటుంది. ఎందరో తల్లులు తమ పిల్లలను ఆరోగ్యంగా, లక్షణంగా పెంచుతారు. అటువంటి పిల్లల ఆరోగ్యానికి సంబంధించి, ఇది ఒక చిన్న పోటీలాంటిది!

ఏమిటంటే—

1. ఆ పాప, లేదా బాబు వయసు మూడు సంవత్సరాలకు మించకూడదు.
2. వారి పుట్టిన రోజు పండుగ – (మొదటిది, లేదా రెండవది, లేదా మూడవది) ఏప్రిల్ మాసం (77) తర్వాత వచ్చేట్టుగా వుండాలి.
3. ఉత్సాహంగల తల్లులు చెయ్యవలసిందల్లా – ఆ పాప (లేదా బాబు) ఫోటో (కార్డు సైజులో వుండాలి. పూర్తి రూపం వుండాలి.) వారి పుట్టినరోజు వచ్చేనాటికి నెలరోజులు ముందుగా మాకు పంపాలి. ఫొటోతోపాటు ఆ శిశువు పేరు, తల్లి పేరు, చిరునామా వుండాలి. అలాగే శిశువు వయసు, పుట్టిన తేదీ, (సంవత్సరం, నెలతో సహా) ఫోటో తీయించిన తేదీ కూడా పంపాలి.
4. వచ్చిన ఫోటోలలో ఆరోగ్యమైన శిశువులను నిర్ణయించి–ప్రతిపక్షమూ (అంటే-ఆ పక్షంలో వారి పుట్టిన రోజు వస్తుందన్న మాట. ఉదాహరణకు–ఏప్రిల్ 1-15 తేదీల మధ్య వచ్చే పుట్టిన రోజులుగల శిశువుల చిత్రాలు ఏప్రిల్ 1వ తేదీ సంచికలో వస్తాయన్న మాట. 15 నుంచి 30 తేదీల మధ్య వచ్చే వారి ఫోటోలు 15వ తేదీ సంచికలోనూ ఆ ప్రకారంగా వస్తాయి) ప్రచురిస్తాము.
5. ప్రచురింపబడిన ఫోటోలలో అమితారోగ్యంగా కనిపించే ఒక శిశువును నిర్ణయించి-ఆ శిశువుకు "మంచి బహుమతి" కూడా పంపబడుతుంది. ఆ బహుమతి, ఆ శిశువు పుట్టిన రోజు పండగ నాటికి 'వనిత' శుభాశీస్సులతో పోస్టు ద్వారా అందుతుంది!
6. ప్రచురణకు స్వీకరింపబడని ఫోటోలు తిరిగి కావాలనుకున్న వారు – స్టాంపులు జతచేసిన కవర్లు (ఫోటోలు పట్టడానికి వీలుగా వుండాలి) పంపితే, తిప్పి పంపేస్తాము.
7. శిశువు పేరు, పుట్టిన తేదీ, తల్లి పేరు, చిరునామా, ఫోటో తీయించిన తేదీ–లలో ఏది లేకపోయినా, ఆ ఫోటోను ప్రచురణకు స్వీకరించలేము.
8. ఫోటోలు, వివరాలూ (పుట్టిన రోజుకు కనీసం నెల రోజులు ముందుగా) ఎడిటర్ 'వనిత'- చందమామ బిల్డింగ్స్ – మద్రాసు–600026 చిరునామాకు పంపాలి.